# స్త్రీ

హోరున కుంభ వర్షం కురుస్తూంది. రాత్రి పది గంటలు దాటిపోయింది. ప్రకృతి క్షణ కాలం భయ విహ్వల అయిన స్త్రీలా వణికి పోతోంది. మరు క్షణంలో ప్రతీకార వాంఛతో మలగి పోతున్న స్త్రీలా బీభత్సంగా వుంటోంది. మధ్య మధ్య స్త్రీలోని కరుణలా మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుములు ఆమెలోని కోపంలా గర్జిస్తున్నాయి.

ఈదర గాలి మొదలయింది, స్త్రీలోని అర్థంకాని భావవీచికలా.

రాధ పిల్లల్ని నిద్ర పుచ్చి చేతిలో లాంతరు పట్టుకొని, ప్రొద్దు ననగా ఆఫీసుకు వెళ్ళిన మురారి కోసం ఎదురు చూస్తూ వాకిలి దగ్గర నిలబడింది. ఈ నిరీక్షణ రాధకు దైనిక కార్యక్రమాలలోనిదే. మురారి 80 రాళ్ళ సంపాదన కొరకు రాత్రి ఏ పది గంటల వరకో తన రక్త మాంసాలను వెల పెట్టి రావటం అలవాటే!

ఒకటి రెండు చినుకులు రాధపై పడ్డాయి గాలి తాకిడికి. ఆ బట్టలు తడిసిపోతే మరో జత లేవు. అయినా అలాగే ఉండిపోయింది.

"జీవితం ఇంత నీరసంగా తయారయిందేం" అనిపిస్తూంది రాధకు. సమాధానం లేదు. తానూహించిన ఆశాసౌధాలు.....తాను నిర్మించుకొన్న ఆశయాల కోటలు ఇలా కూలి పోయాయి......?

ఇలా ఆలోచించుకొన్నపుడల్లా రాధలో శంకరం మీద ఏదో నిద్రాణమైన పగ ప్రజ్జ్వరిల్లుతుంది. ప్రతీకార వాంఛ ప్రబలుతుంది.....కాని ఏమిటో, తానొక అశక్తురాలు.



"అదేమిటి రాధా! అలా ఉండిపోయావు?" మురారి పలుకరించేవరకు రాధ పరధ్యానంగా ఉండిపోయింది.

"వచ్చారా - అయ్యో! పూర్తిగా తడిసిపోయారు. బట్టలు మరో జతన్నాలేవు, రేపు ఆఫీసుకు" అంది రాధ.

మురారి పొడినవ్వు నవ్వాడు. అది నవ్వు కాదు. నవ్వినట్లు అలా నటించాడు. అంతే! ఆ నవ్వు వెనకాల జీవితమంటే అసహ్యం, జుగుప్స, తన అశక్తత ధ్వనించాయి.

భోజనాలు పూర్తి అయ్యాయి.

మురారి కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. పనులు పూర్తి చేసికొని వచ్చిన రాధ అడిగింది - "ఏమిటండీ, అలా ఉన్నారూ?" అని.

మురారి దీపం వైపు నిశ్చలంగా చూస్తూ, "అదే రాధా! మన బుజ్జి విషయం - శంకరం మళ్ళీ ఇవాళ ఆఫీసుకు ఫోను చేశాడు -" అన్నాడు.

దూరంగా ఫెళ ఫెళ మంటూ గర్జించింది మేఘం.

"మళ్ళీ ఏముఖం పెట్టుకొని ఆ శంకరం మిమ్మల్ని పిలిచాడు? మీరెలా పలికారు? ఒకసారి చెపితే చాలదూ? ఆ మాత్రం జ్ఞానం అతనిలో ఎలా నశించింది?" అంటూ రాధ ఉగ్రురాలయింది.

మురారి క్షణ కాలం రాధ వైపు చూడలేక పోయాడు. ఆ తరువాత -

"రాధా! ఆవేశంతో కాక, శాంతంగా ఆలోచించు. బుజ్జికి నేనూ తండ్రినే! చూస్తూ చూస్తూ బుజ్జిని దూరం చేసికోవాలనుకొనే రాక్షసుణ్ణి కాను. కాని ఒక్కటి ఆలోచించు. బుజ్జి భవిష్యత్తు? వాడూ మనలా చాలీ చాలని తిండితో, ఇలా దారిద్ర్యంతో, హీనంగా, దీనంగా బ్రతకరాదనే నా ఆలోచన. తండ్రిగా నేను, తల్లిగా నీవు వాణ్ణి ఎంత వృద్ధిలోకి తీసికొని రాగలం చెప్పు? కాకుంటే మన మాతృ పితృ ప్రేమలతో వాణ్ణి ఒక బికారిగా తయారు చేయగలం - వాడి భవిష్యత్తును నిప్పుల పాలు చేయగలం! అంతేగా?

"కాని శంకరం చేతుల్లో వాణ్ణి పెడితే బుజ్జి ప్రయోజకుడవుతాడు. వాడి తరువాత పది తరాలు తినగల ఆస్తికి వారసుడవుతాడు. పైగా మన కళ్ళ ముందే ఉంటాడు. ఇక శంకరం అంటావా? సహృదయుడు, మనకు అయినవాడు. మన బిడ్డను మనకు దూరం చేయడు. ఏమంటావు?" అంటూ సూటిగా రాధ కళ్ళలోకి చూచాడు మురారి.

రాధ కళ్ళలో ఏదో అర్థం కాని భావం తొణికిసలాడింది . పొంగి పొరలి వస్తున్న ఆవేదన, ఆవేశం గోచరించాయి. ఆ చూపులు మురారిని నిలువవేస్తున్నట్టు కన్పించాయి.

"రాధా! ఈ విషయంలో నీ మాతృత్వం బుజ్జి భవిష్యత్తుకు అడ్డుగా నిలిస్తే,

భావిలో నీ పొరపాటుకు నీలో నీవే కృంగిపోతావు. ఆనాడు తిరిగి ఇలాంటి సదవకాశం కోసం నీ మాతృత్వం విశ్వ ప్రయత్నం చేసినా ఓడిపోతుంది. ఇలా అంటున్నందుకు క్షమించు. ఆలోచించు" అన్నాడు మురారి.

రాధకు కనుల వెంట నీరు తిరిగింది. కానీ ఏడవాలనిపించలేదు.

తన అంతరాత్మలోని వేదన వేరు. మురారి ఊహిస్తున్నది వేరు. తన సంతానపు భవిష్యత్తు దివ్యజ్యోత్స్న కావాలని ఏ మాతృ హృదయం ఆశించదు? లేకుంటే ఈ సృష్టికి ఆధారం ఏముంది? మాతృత్వానికి అర్థం ఏమిటి? నిర్వచన మేమిటి?

కాని..... రాధ స్మృతిని వారించినా వినక గతంలోకి దారితీసింది.

★ ★ ★

రాధ పుడుతూనే తండ్రిని కోల్పోయింది. మరో మూడు సంవత్సరాలకు తల్లి దూరమయింది. మేనమామ భుజంగరావుగారే చేరదీసి పెంచి పెద్ద చేశారు. భుజంగరావుగారు పుసులూరు గ్రామంలో శ్రీమంతులు. శంకరం, వారి ఏకైక సంతానం. రాధ కన్నా శంకరం నాలుగు సంవత్సరాలు పెద్ద, వయసులో. ఇద్దరూ వీధిబడిలో చెరో తరగతిలోనూ చదివారు. ఆ తరువాత కొంచెం ముందు వెనుకలుగా అక్కడే హైస్కూల్లో చదువుకొన్నారు. క్షణ కాలం ఒకరినొకరు విడిచి ఉండేవారు కాదు. వారి బాంధవ్యంకన్నా, వారి స్నేహలత బలవత్తరంగా పెంపొందింది. రాధ హైస్కూల్లో నాలుగవ ఫారం చదువుతూ ఉండగా, శంకరం కళాశాల చదువుకు గుంటూరు వెళ్ళిపోవల్సివచ్చింది.

శంకరం కళాశాల చదువుకు వెళ్ళుతూ ఉంటే రాధ కెలాగో అనిపించింది. ఏదో విడలేని మమత ధ్వనించింది. తీరా బండి ఎక్కుతూ 'వస్తాను రాధీ' అని శంకరం అన్నప్పుడు, రాధ కనుల నుండి నీరు తిరగటం, రాధ ఎంత మరుగు పరచాలని ప్రయత్నించినా దాగలేదు.

శంకరం కళాశాల చదువుకై వెళ్ళిపోయాక, రాధకు ఒంటరితనం దుర్భర మనిపించేది. హైస్కూలుకు ఒంటిగా వెళ్ళటం బాధగా ఉండేది. అన్నీ కలిసి వచ్చాయి. రాధ వ్యక్తురాలు కావటంతో చదువుకు స్వస్తి చెప్పవలిసి వచ్చింది.

శంకరం జాబులు వ్రాసేవాడు. ఆ జాబుల్లో రాధను గురించి ఎంతో వ్రాసేవాడు - "రాధి ఏమంటూంది" అంటూ. శంకరం రాధను - 'రాధీ' అనటం

అలవాటు. ఏవో పుస్తకాలు పంపేవాడు. రాధకు ఆ పుస్తకాలు చూస్తూన్నా, చదువుతున్నా శంకరం కన్పించినట్లయ్యేది.

'శంకరం సూర్యుడు - తానొక పద్మం. శంకరం చంద్రుడు - తానొక కలువ!' అనుకొనేది రాధ. శంకరం ఒక పెద్ద గ్రహం. ఆ గ్రహాన్ని అంటిపెట్టుకొని ఉన్న ఉపగ్రహం తాను. శంకరం సెలవలకు వచ్చినప్పుడల్లా తన కెన్నో చీరలు తెచ్చేవాడు; బస్తీ విషయాలెన్నో చెప్పేవాడు - తమ లెక్చరర్లను ఎలా ఉడికించేది, తోటి విద్యార్థినుల నెలా ఏడిపించేది-

"తప్పు కాదా బావా! పెండ్లికాని అమ్మాయిలనలా ఏడిపించవచ్చా? అవ్యక్తంగా, అనాలోచితంగా ఒక్కోసారి మీరు చేసే పనులు ఎంతటి విపరీత పరిణామాలను కల్పిస్తవో ఊహించేనా మీరలా చేసేది?" అనేది రాధ.

"అవును రాధీ.....తప్పే.....అనాలోచితపు పనులే!" అనేవాడు శంకరం, తప్పు తెలిసికొని.

శంకరం బి.ఎ. లో చేరాక సెలవులకు ఇంటికి రావటం తగ్గిపోయింది. జాబుల్లో సెలవులకు ఇంటికి వస్తే చదువు నాశనమవుతుంది అని వ్రాసేవాడు. ఏదో విజ్ఞాన యాత్రకు వెళ్ళుతున్నానని వేసవి సెలవలకు కూడ రాలేదు శంకరం. రాధ మనస్సు చివుక్కుమంది.

కాలం దొరలి పోయింది. మానవుడిలో, సృష్టిలో, సంఘంలో విపరీత పరిణామాలకు, పరిస్థితులకు కారణభూతమయింది కాలం ఒక్కటే. కాలభ్రమణం లో విపరీత రూప భావాలు ఏర్పడతాయి. దురంత దుఃఖం, అతులితానందం తారుమారవుతాయి. వస్తు ధర్మాన్ని నిర్ణయించగలం; దాని పరిణామాన్ని ఊహించ గలం; కాని కాల పరిణామాన్ని నిర్ణయించటం సృష్ట్యాది నుండి మానవునికి అతీతమైనదిగానే మిగిలి పోయింది.

ఒకనాడు భుజంగరావుగారు రాధను పిలిచి, ఆమె వివాహం విషయం, తాను చూచివచ్చిన సంబంధాల విషయం ఎత్తారు. రాధ నెత్తిన పిడుగు పడినట్లయింది. కాళ్ళ క్రింద భూమి పోయినట్లైంది.

"ఆలోచించుకో తల్లీ! నిన్ను పెంచినందుకు ఏ బికారి చేతిలోనో పెట్టి నా బాధ్యత తీరిందనుకోను. మంచి సంబంధాలనే తెచ్చాను. తాపీగా ఆలోచించుకొని

చెప్పు" అని వెళ్ళిపోయారు భుజంగరావుగారు.

ఆ రాత్రల్లా నిద్దుర పట్టింది కాదు. 'తన హృదయం మామయ్యకు తెలియదా? లేక తెలిసే అన్యాయం చేస్తున్నారా?' అని ప్రశ్నించుకొంది. తన హృదయగత భావాలు మామయ్య కెలా తెలుస్తాయి? ఏమో! అంతా భయ మనిపించింది. శంకరం సాన్నిధ్యంలో జీవిత మాధుర్యాన్ని అనుభవిద్దామనుకొన్న తన ఆశ ఏమవ్వాలి? ఏమిటీ అపశ్రుతి?

తన కొక్కటే ఆశాజ్యోతి - "శంకరం". శంకరానికి జాబు వ్రాసింది. ఆ జాబులో తన హృదయాన్ని విప్పి శంకరం ముందుంచి - "బావా! ఈ జీవితం, హృదయం, భావం, వాక్కు, కర్మ నీకే నివేదన చేశాను; చేస్తున్నాను. అనుగ్రహించి స్వీకరించి నన్ను ధన్యురాలిని చేయవూ? జవాబు కోసం కన్నులలో వత్తులు వేసికొని, ఆశలను దృష్టిలో నిల్పుకొని, ఎదురు తెన్నులు చూస్తూ ఉంటాను - నీ రాధి" అని వ్రాసింది.

ఏ జాబు కోసం, క్షణాలను యుగాలుగా మార్చుకొంటూ నిరీక్షించిందో ఆ జాబు వచ్చి రాధ ఆశలను కూల్చివేసింది.

"నీలో ఆశలు రేపానేమో.....కాదనలేను. కాని గుర్తుందేమో! 'అవ్యక్తంగా, అనాలోచితంగా చేసే పనులు విపరీత పరిణామాలకు దారి తీస్తా'యని అన్నావు ఒకసారి. అలాంటి సంఘటనే జరిగింది. ఈ ఊరి జడ్జిగారమ్మాయి, నిర్మలతో నా పరిచయం, ఏదో కాకతాళీయంగా ప్రారంభమైనా, మాకు ముందు చూపు లేకపోవటం వలన కొంత విపరీత పరిణామాలకే దారి తీసింది. ఇలాంటి పరిస్థితులలో నేను నిర్మలకు దూరం కావటానికి వీలులేదు. అలా జరిగితే ఆమె జీవితం బుగ్గి పాలు అవుతుంది. ఆమె ఆత్మహత్యకే పాల్పడవచ్చు. అందుకే ఆమెను భార్యగా స్వీకరింపదలచాను.

మన గత జీవితం చెదిరిన కల అనుకో......నన్ను క్షమించు రాధీ...న్యాయం చేయాలని కన్ను పొడుచుకొనేవారు లేకపోలేదు. అలాగే మన జీవితాలు.

నాన్నగారు తెచ్చిన వాటిలో మంచి సంబంధాన్ని నిశ్చయించుకో. మరోసారి అడుగుతున్నాను- నన్ను క్షమించు.

శంకరం."

ఆ జాబు ఎన్ని తుంపులయిందో - అన్ని తుంపులయింది రాధ హృదయం. నమ్మకంగా తన్నొక శిఖరాగ్రం పైకి తీసికొని వెళ్లి, ప్రక్కనున్న లోయలోకి త్రోసివేశాడు శంకరం. జడ్జిగారి అమ్మాయనే వ్యామోహం, హోదా.....శంకరాన్ని వశపరచుకొన్నాయి. రాధ హృదయం భగ్నమంది.

స్త్రీలో ఏ భావం విపరీతమైనా ఫలితాలు విరుద్ధంగా ప్రతిబింబిస్తాయి. శంకరం జాబు చూచాక రాధ పడ్డ చిత్తక్షోభ, ఆమెలో కసిగా, పగగా మారిపోయింది. ఆమెలోని అభిజాత్యం మేల్కొంది. శంకరం అనే వ్యక్తిని తనకు దూరంగా నెట్టెయ్యాలనే వాంఛ బయలుదేరింది. అతని ఆస్తితో తానొక శ్రీమంతుల కోడలు అవ్వటానికి ఆమె హృదయం అంగీకరించలేదు. అందుకే భుజంగరావుగారు తెచ్చిన మంచి సంబంధాల నన్నీ కాదని నిరాధారుడైన మురారిని వివాహమాడటానికి నిశ్చయించుకొంది.

భుజంగరావుగారు తెల్లపోయారు.

"అంతే మామయ్యా! ఈ సంబంధాన్ని స్థిరపరచండి" అంది. భుజంగరావు గారు ఏదో చెప్పాలని ప్రయత్నించారు. కాని, ఏదో విపరీత లక్ష్యం వైపు సాగిపోతున్న రాధ ముందు ఆయన ప్రయత్నం విఫలమయింది.

రాధా మురారుల వివాహం జరిగి పోయింది. వివాహానికి శంకరం వస్తాడేమో, అతనికి తానుగా కోరి కోరి దిగజారి పోతున్న దారిద్ర్య పరిధిని చూపి అవహేళన చేద్దామనుకొంది. కాని శంకరం నుండి తంతి ద్వారా ఆశీస్సులు వచ్చాయి. చివరి సారిగా తన హృదయంలో ఏ మూలనో లీలామాత్రంగా ఒదిగి ఉన్న శంకరాన్ని పెకలించివేసి నిట్టూర్చింది రాధ.

మూడు నిద్రలకు వెళ్ళిన రాధ తిరిగి పుసులూరు రాలేదు. భుజంగరావుగారు ఎంతో బ్రతిమాలారు - "వేడుకలను, సంప్రదాయాలను మనం కాదనరాదు" అంటూ. కాని రాధ తిరిగి రాలేదు. రాధను అర్థం చేసుకోలేకపోయారు భుజంగరావుగారు.

సంవత్సరం రోజులు తిరిగి పోయాయి. మురారి గుంటూరులో గుమాస్తా గిరిలో చేరాడు. నిర్మలతో శంకరం పెళ్ళి అని జాబు వచ్చింది. జాబు వెంటనే భుజంగరావుగారు వచ్చారు తీసికొని వెళ్ళటానికి. మురారి, రాధను తీసికొని

వెళ్ళమన్నాడు. 'హారికి భోజనానికి ఇబ్బంది, పెళ్ళినాటికి వస్తాం' అంది రాధ.

తీరా పెళ్ళినాటికి రాధే మళ్ళీ ఏదో అడ్డంకి చెప్పింది. శంకరం పెళ్ళికి రాధ వెళ్ళింది కాదు.

ఏడు సంవత్సరాలు తిరిగి కాలగర్భంలో కలిసి పోయాయి, తమ గుర్తులను మిగిల్చి. రాధకు ముగ్గురు పిల్లలు కలిగారు. పెద్దవాడు బుజ్జి; ఆ తరువాత ఉమ. ఆఖరివాడు నాని. చాలీచాలని జీతపు రాళ్ళతో జీవితం దుర్భరమయింది. తప్పే దేముంది? కోరి వరించిన జీవితం!

ఆమధ్య ఓసారిభుజంగరావుగారు వచ్చారు. శంకరం నిర్మలతో విశాఖలో ఉంటున్నాడట ఏదో ఉద్యోగం చేస్తూ. నిర్మలకు గర్భం పోయిందట. చాల ప్రమాదమే సంభవించిందట - ఆపరేషన్ చేయవలసి వచ్చిందట - ఏమయితేనేం ఆమె ఇక సంతానవతి అయ్యే అవకాశాలు లేవు - అంతా చెప్పి మామయ్య నిట్టూర్చారు.

మామయ్య మాటలు ఎంతో శ్రద్ధతో వినబుద్ధి వేసింది రాధకు.

ఆ రాత్రి మామయ్య బుజ్జిని, ఉమను తన దగ్గర పండుకొన బెట్టుకొని తెగ మురిసి పోయారు. వారి వైపు ముఖం వాచినట్లు చూచారు. రాధ హృదయంలో ఏదో వికృతాట్టహాసం ధ్వనించింది.

శంకరం తండ్రి కాలేడు - అనే భావం ఆమెలో ప్రాప్తిని పొందింది.

భుజంగరావుగారు తిరిగి వెళ్ళిన వారం రోజులకే పిడుగులాంటి వార్త అందింది - ఆయన గతించారని. రాధ దుఃఖాంబుధిలో మునిగి పోయింది. ఆ మహత్తరమూర్తి దాటిపోయారంటే హృదయం క్షోభించింది.

శంకరం నుండి కబురు వచ్చింది రాధకు, కర్మాంతరాలకు రావలసినదని. మొదట మామయ్య మీద ఉండే భక్తి భావంచేత వెళ్ళాలనుకొంది కాని....ఆయనే దాటిపోయాక....అక్కడ తనకు మిగిలింది ఏమీ లేదని విరమించుకొంది.

నెల రోజుల తరువాత మురారి చెప్పాడు, శంకరానికి గుంటూరు బదిలీ అయిందని.

రాధ క్షణకాలం నిరుత్తరురాలయింది. ఏనాడో తన హృదయం నుండి,

దృష్టి పథం నుండి దూరం చేసికొన్న శంకరం, మళ్ళీ తన ముందుకు తారస పడటమా? ఏదో భయం వేసింది. రాధ ఆత్మ పరీక్షకు గురి అయింది. ఆమెలో శోధన ప్రారంభమయింది. గత ఎనిమిది సంవత్సరాలుగా మురారికి భార్యగా, తన సతీ ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహించింది. అందులో ఎలాంటి అనుమానానికి స్థానం లేదు. కాని, శంకరం వస్తున్నాడంటే తన కెందుకో భయం....అర్థం కాలేదు. కాదు.....అర్థమయింది. అది భయం కాదు ద్వేషం......పగ......వాటి భయంకరమైన నీడల తాలూకు భావ ఘర్షణ.

సతి రాధకు, ఈ ద్వేషాన్ని, పగను తనలో పెపొందించుకొవలసిన ఆగత్య మేమిటి? ఏమో....సమాధానం లేదు....అది అంతే! రాధ అంతకన్నా హృదయ శోధన చేసికొనలేక పోయింది.

శంకరం గుంటూరు బదిలీ అయి వచ్చాక ఒక రోజున నిర్మలతో కలిసి చూడటానికి వచ్చాడు. ఆ కొన్ని క్షణాలూ రాధకు బాధగానే పరిణమించాయి. నిర్మలతో వంటింటిలోకి వెళ్ళి పోయింది. శంకరం, మురారి వసారాలో కబుర్లలో పడ్డారు.

తిరిగి వెళ్ళిపోతూ, "మీరంతా రేపు మా యింటికి రావాలి. కారు పంపు తాను" అన్నాడు శంకరం. తాను మాట్లాడింది కాదు.

శంకరం.....తన కారును.....నగలలో మునిగి పోయిన తన భార్యను చూపటానికి వచ్చాడు - అనుకొంది రాధ.

మాసిపోయిన తన చీరను చూచి విరక్తిగా నవ్వుకొంది. మరునాడు ప్రొద్దున్నే కారు వచ్చింది. రాధ మురారిని పిల్లల్ని వెళ్ళమంది.

"అదేమిటి రాధా? పాపం శంకరం మనసు నొచ్చుకోదూ" అన్నాడు మురారి.

"అతనికి నొచ్చుకొనేటంత మనసు లేదు" అంది తాను.

మురారి ఏమీ అర్థంకాక పిల్లలతో వెళ్ళాడు శంకరం ఇంటికి.

రాత్రి చీకటిపడి తిరిగి వచ్చిన మురారి శంకరం తనతో అన్న మాటలు చెప్పాడు - రాధలో లోలోన రగుల్కొంటున్న మంట గుప్పుమంది.

"నే నొప్పుకోను....ఇందుకు నా మనసు, నాలోని ప్రతి అణువు ఒప్పుకోవు.

బుజ్జి నా వాడు.....నా ప్రాణం....వాడి మీద ఎవరికీ ఎలాంటి హక్కూ లేదు-" అంది రాధ.

తమ జీవితాలు దుర్భరాలట. బుజ్జిని తమకు పెంచుకోవటానికి ఇవ్వాలట. ఇదీ శంకరం కోరిక. మురారి దూరదృష్టిలోని 'విజ్ఞత' సరే అని అనగలిగింది. కాని రాధ.....రాధలో సుడులు తిరుగుతున్న మరో భావన అడ్డు తగిలింది.

"శంకరానికి నిష్కర్షగా చెప్పివేయండి" అని చెప్పింది; ప్రొద్దున ఆఫీసుకు వెళ్ళిపోతూ ఉండగా. మళ్ళీ ఫోను చేశాడని మురారి చెప్పాడు ఈ రాత్రి.

రాధ స్మృతుల నుండి తేరుకొంది.

★ ★ ★

మురారికి ఎప్పుడు నిద్ర పట్టిందో నిదుర పోయాడు. రాధ మాత్రం అలాగే కూర్చొని ఉండిపోయింది. లాంతరులోని కిరోసిన్ అయిపోయినట్లుంది. చిన్న చిన్నగా క్షీణించి క్షీణించి ఘనమైపోయింది.

ఒకనాడు రాధ ఆశలు, నమ్మకాలు శంకరం పట్ల అలాగే చిన్న చిన్నగా క్షీణించి నశించిపోయాయి, ఈనాటి దీప కాంతిలాగే. శంకరం తన కానాడు దూరంగా తొలగి పోయాడు, తన్ను ఒంటరిగా వదలివేసి.

ఈ జగతిలో మానవుడే మంచిని, త్యాగాన్ని, కరుణను, ధర్మాన్ని తానుగా పారద్రోలి, భ్రష్టుడై దానవుడవుతున్నాడనడానికి శంకరం నిదర్శన మనుకొంది రాధ.

తాలుకా కచేరీలో మూడు గంటలు కొట్టారు. రాధ నిద్ర పోయింది.

రాధ నిద్ర లేచేపాటికి మురారి బావి దగ్గర స్నానం చేసి రాత్రి తడిసి సరిగా ఆరీ ఆరని ఆ బట్టలనే వేసికొని బయలుదేరాడు.

రాధ ఆశ్చర్యపోయింది.

"ఎక్కడికండి ఇంత ప్రొద్దున్నే బయలుదేరారు?" అంది. మురారి సమాధానం చెప్పలేదు. నిద్రపోతున్న బుజ్జి కేసి ఓసారి దృష్టి సారించి వెళ్ళిపోయాడు బయటకు.

రాధ నూతి దగ్గరకు పళ్ళు తోముకోవటానికి వెళ్ళి అలాగే ఆలోచనలో

పడిపోయింది, నిజంగానే తాను బుజ్జి భవిష్యత్తును బలిగొంటున్నానా అని. పరి పరి విధాల ఆలోచనలు దొర్లినాయి. మనస్సు వికలమయింది.

ఒక ప్రక్క తనలో అణగారిన పగ - తనలో మేల్కొంటున్న అభిజాత్యం - మరో ప్రక్క మాతృత్వం - ఈ రెంటి మధ్య ఘర్షణ. ఎంత సేపలా గడిచిందో.... బయట ఎవరో వచ్చిన చప్పుడయింది. మురారి అయి ఉండవచ్చు. 'కాఫీకి కుంపటన్నా రాజేయలేదు' అనుకొంటూ వరండాలోనికి వచ్చిన రాధ, బుజ్జిని ఎత్తుకొని నిలబడిన శంకరాన్ని చూచి గతుక్కుమంది.

"రాధీ!" అన్నాడు శంకరం.

రాధ వంట గది తలుపును అడ్డంగా పెట్టుకొని నిలబడింది.

"క్షమించు రాధీ! నిన్నుగా ప్రాధేయపడదామని వచ్చాను. నా జీవితంలో ఇందుకైనా నోచుకోనిస్తావని వచ్చాను -" అంటూ ఏదో చెప్పబోయాడు శంకరం.

మేఘం గర్జించినట్లైంది.

"క్షమించటం! మీరేం తప్పు చేశారని. మీరు శ్రీమంతులు. ఆ ఆస్తిపాస్తులతో మీరు మనుషులను కొనగలరు - అమ్మ గలరు - అలాంటి మీరు తప్పు లెలా చేస్తారు?"

"రాధీ!"

"నా పేరు రాధ! శంకరంగారూ, మనిషికో మాట చాలనుకొంటాను. బుజ్జి మీకు దక్కడు. బుజ్జి రాధ బిడ్డ - మురారి సంతానం. మీకు అలాంటి భాగ్యం లేదు. సంతానాన్ని పొందగల పెద్ద హృదయాన్ని భగవంతుడు మీకు ప్రసాదించలేదు. డబ్బుతో కొనలేనవి చాలా ఉంటాయి. ఇక మీరు వెళ్ళవచ్చు-" ఆవేశ శిఖరాగ్రం పై నుండి వర్షించినట్లు మాట్లాడింది.

శంకరం నిరుత్తరుడయ్యాడు.

రాధ తలుపు మూసివేసింది.

"రాధా! వెళతాను! కాని ఒక్క మాట.... నీవు స్త్రీవి. నీ యందు క్షమ, కరుణ లేవని గ్రహించిననాడు, నిన్ను నీవే క్షమించుకోలేవు-" శంకరం నిట్టూర్చి భారంగా వెళ్ళిపోయాడు.

రాధ ముందొక పెనుతుఫాను లేచింది. వెక్కి వెక్కి ఏడ్చి, అలాగే ఆ మూలనే కూలబడి పోయింది.

★ ★ ★

11 గంటలయింది. పిల్లలు బడి నుండి వచ్చి, అన్నం అని గోలచేశారు. లేచి, వంట చేసి పిల్లలకు పెట్టి, మురారి కోసం ఎదురు చూస్తూ ఉండిపోయింది.

రాధ అదోలా ఉండటం చూచి, దూర దూరంగా తిరిగారు పిల్లలు ఆనాడంతా. సాయంత్రమయింది. పశ్చిమాన క్రుంకుతున్న సూర్యుణ్ణి పెరటిలో నుండి చూచింది - రాధ. ఆ అరుణకాంతి తనను చూచి జాలి పడుతున్నట్లు అనిపించింది.

సంధ్య వచ్చింది. చిరు చీకటి అలమింది, రాధ హృదయంలో. నీటి బుగ్గల్లా ప్రశ్నలు ఉదయించి హరించిపోతున్నయి. పిల్లలు అన్నం అడక్కుండానే నిద్రపోయారు.

దివస్సును హరించిన తిమిరం దిగంతమంతా వ్యాపించింది. ర న మురారి కోసం, చేతిలో దీపంతో ఎదురు చూస్తూ కూర్చుంది.

రాత్రి 11 గంటలకు మురారి వచ్చాడు. మురారిని చూస్తూనే, రాధ కన్నీరు కార్చింది. మురారి కరిగిపోయాడు.

రాధ ముంగురులు సర్దుతూ - "రాధా! నిన్ను కాదని నేను ఏం చేస్తాను చెప్పు.... ఆలోచించాను - ఈ రోజల్లా ఆలోచించాను.... నీలోని పుత్రేషణను బలవంతంగా....."

"అది కాదండి" - రాధ అడ్డు తగిలింది. మురారి ఆగిపోయాడు.

"నా కోరిక ప్రకారం నడుచుకొంటానని మాట ఇవ్వండి-" కన్నీరు మున్నీరై చేయి చాపింది.

మురారి - మురారే కాదు, ఎవ్వరైనా ఆ క్షణంలో రాధను చూచి జాలి పడనివారుండరు.

"ఏమిటి రాధా?"

రాధ తన సర్వశక్తులను కూడదీసికొని దు:ఖాన్ని దిగమ్రింగుకొంది.

"బుజ్జిని శంకరానికి ఇవ్వండి. కాని మనం మాత్రం దూరంగా బదిలీ

చేయించుకొని వెళ్ళాలి."

మురారి స్తబ్దుడయ్యాడు.

"అవును.... శంకరానికి... కాదు బుజ్జికి దూరంగా తొలగి పోవాలి - మాట ఇవ్వండి."' చాపిన చేతిని మురారి ముందుంచింది రాధ.

మురారి రాధ కళ్ళలోకి చూచాడు.

ఆమె కంటిలో రెండే రెండు బిందువులు కన్పించాయి. ఆ కన్నీటి బిందువులలో మాతృత్వపు మమత, మరేదో అర్థం కాని విపరీతపు భావనావీచిక కన్పించాయి.

అదే క్షణంలో రివ్వున వీచింది గాలి. ఆ గాలిలో 'స్త్రీ' అనే ధ్వని పుట్టి ధ్వనించి, ప్రతి ధ్వనించి గాలిలో కలిసిపోయింది.

అ ప్రయత్నంగా మురారి చేయి రాధ చేతిని స్పృశించింది.

★ ★ ★

ప్రకృతి స్త్రీలోని ఆర్ద్రతలా, ప్రశాంతంగా.... స్త్రీలోని మమతలా చల్లగా.... ఆమెలోని క్షమలా, హాయిగా ఉంది.

కానీ....

మధ్య మధ్య స్త్రీలోని అర్థం కాని భావంలా కొంచెం కొంచెంగా ఈదర గాలి వీస్తూంది.

## కథ వెనుక కథ :

మిత్రుడు శ్రీ పి. హనుమంతరావు చెప్పాడు - తమ బంధువుల కుటుంబంలోనో, తెలిసినవారి యింటనో, దత్త స్వీకారం నాడు జరిగిన ఓ సంఘటనను గురించి. ఆ జనక తల్లికి, ఆ దత్తత ఇష్టం లేదట. దత్త స్వీకారం చేసికొన్న తండ్రికి ఆ పిల్లవాని తల్లి పూర్వ పరిచితురాలేనట.

కారణం 'ఇది' అయి వుంటేనో అని ఊహించిన కథ.

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : ఉగాది : 11.4.1962)* ★